క్లుప్తంగా

సైక్లింగ్ ప్రారంభం



ఊట్కూరు: ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ఆయుష్మాన్ భారత్ హెల్త్ వెల్నెస్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ సైకిల్ నడపడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. సైక్లింగ్ కార్యక్రమంలో విద్యార్థులు, డా. అవీష్, వైద్య సిబ్బంది విజయ్‌కుమార్, మహేశ్వరి, మంజుల పాల్గొన్నారు.

పాఠశాలలో ఆకస్మిక తనిఖీ



మక్తల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎంఈఓ లక్ష్మీనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. మధ్యాహ్న భోజనం, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పలు సూచనలు చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. జీహెచ్ఎం అనిల్‌గౌడ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



మక్తల్: అనుగొండలో వివిధ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డికి గ్రామస్తులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఆర్ అండ్ ఆర్ సెంటర్, ఎస్సీ కాలనీలో ప్లాట్లు, నీటి సరఫరా, దాదాన్‌పల్లి నుంచి అనుగొండ రోడ్డు తదితర సమస్యలు ఉన్నాయని ఆయనకు విన్నవించారు.

ఎత్తిపోతలపై చిత్తశుద్ధి లేదు

నారాయణపేట టౌన్ : పేట – కొడంగల్ ఎత్తిపోతల పథకం పై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని జల సాధన సమితి జిల్లా కో-కన్వీనర్ హెచ్. నర్సింహా విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జీవో నెంబర్ 69 అమలు చేపట్టకుండా రైతులను మోసం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే చేయాలని డిమాండ్ చేస్తూ మే 23న ఆమరణ నిరాహార దీక్ష చేపడుతున్నట్లు పేర్కొన్నారు. 2014 మే 23న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హయాంలో ఎత్తిపోతల పథకం చేపట్టాలని జీవో 69ను విడుదల చేశారని గుర్తుకు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యపు వైఖరిని నిరసిస్తూ దీక్ష చేపట్టనున్నట్లు వివరించారు.

వైభవంగా కల్యాణం



మక్తల్: జక్లేర్ గ్రామం మంగళవారం శివనామస్మరణతో మార్మోగింది. మాలాధారులు మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. కలశ ఊరేగింపు చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు. గురుస్వాములు గోపాల్, భాస్కర్, నర్సిములు, గోపిరాజు, శ్రీనివాస్‌రెడ్డి, భీంసేన్ తదితరులు పాల్గొన్నారు.

నర్వ: మండలంలోని రాంపూరం బాలాంజనేయస్వామి ఆలయ ఆవరణలో మంగళవారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ శివ భక్తుల ఆధ్వర్యంలో మహోత్సవాన్ని అర్చకులు నాగస్వామి అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలను మహిళా భక్తులు సమర్పించగా క్రతువును నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో శివభక్తులు భగవంతాచారి, శ్రీనివాస్‌రెడ్డి, యాదవరెడ్డి, బాలవర్ధన్‌రెడ్డి, నిర్వాహకులు వెంకట్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, శివారెడ్డి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పన్నులు సకాలంలో చెల్లించండి

అమరచింత: స్థానికులు సకాలంలో ఇంటి, ఇతర పన్నులను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని పురపాలిక కమిషనర్ మహ్మద్‌ఖాజ అన్నారు. మంగళవారం కార్యాలయం సిబ్బందితో కలిసి పట్టణంలో పర్యటించి ఇంటింటికీ వెళ్లి పన్నులు చెల్లించాలని అభ్యర్థించారు. పట్టణ అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలని, పట్టణం పరిశుభ్రంగా ఉండేందుకు సహకరించడంతో పాటు చెత్తను ఎక్కడిబడితే అక్కడ వేయకుండా చెత్తబండ్లలోనే వేయాలని కోరారు.

వీర జవాన్లకు ఘననివాళి



మౌనం పాటిస్తున్న శ్రీసాయి స్కూల్ విద్యార్థులు



మరికల్‌లో కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న యువకులు

నారాయణపేట టౌన్ : పుల్వామా ఘటనలో 14 ఫిబ్రవరి 2019న వీర మరణం పొందిన జవాన్లకు మంగళవారం జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. శ్రీసాయి హై స్కూల్‌లో విద్యార్థులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి, నివాళులర్పించారు. కరస్పాండెంట్ సాయిలీల మాట్లాడుతూ ప్రతి విద్యార్థి దేశభక్తి కల్గి ఉండాలన్నారు. ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ దేశానికి సేవ చేయాలని అన్నారు. అదే విధంగా భావ సమైక్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక వీరసావర్కర్ చౌరస్తాలో జవాన్లకు నివాళి అర్పించారు. భావ సమైక్య వేదిక వ్యవస్థాపకులు కుర్మన్న అమర జవాన్ల చిత్రపటాలకు పూలమాలలు వేశారు. సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో వీర జవాన్ల చిత్రపటాలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో వీర జవాన్ల ఆత్మలకు శాంతి చేకురాలని ప్రార్థిస్తూ, మౌనం పాటించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఆచార్య, మాతాజీల బృందం పాల్గొన్నారు.

మక్తల్: వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో మంగళవారం మక్తల్ పట్టణంలో శ్రీపడమటి ఆంజనేయ స్వామి దేవాలయంలో అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళిలు అర్పించారు. ప్రభుత్వాలు వాలెంటైన్స్ డే నిషేధించాలని ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సత్యానారాయణగౌడ్, మల్లికార్జున్ రావు, రామాంజనేయులు, నవీన్, వినయ్, వంశీ, సాందీపని, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో..

మరికల్: పుల్వామా ఘటనలో అమరులైన జవాన్లకు మంగళవారం రాత్రి మరికల్‌లో కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. రాజేష్, రామకృష్ణారెడ్డి, మల్లేష్, రవి, మహాలింగం, శివ, నర్సిములు పాల్గొన్నారు.



మక్తల్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు



వీరసావర్కర్ చౌరస్తాలో నివాళి అర్పిస్తున్న భావ సమైక్య వేదిక సభ్యులు

వేడుకగా విగ్రహ ప్రతిష్ఠ



ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

కోస్గి: పట్టణంలోని మున్నూర్ వీధిలో శ్రీ నాభి శిలా(బొడ్రాయి) విగ్రహప్రతిష్ఠ వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తిమ్మన బావి శివాంజనేయ స్వామి ఆలయ శివభక్తుల ఆధ్వర్యంలో ఈ ప్రతిష్ఠాపన వేడుకలు ఈ నెల 19 వరకు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు మంగళవారం గణపతి, గౌరీ పూజ, గోపూజ, అఖండ దీపారాధన, స్వస్తి పుణ్యాహవాచనం, యాగశాల ప్రవేశం ప్రవేశం, రుత్విగ్వరణము, విగ్రహాభిషేకం, జలాధివాసం, మంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో బొడ్రాయిని ఊరేగించారు.

రేణుక ఎల్లమ్మకు పూజలు

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని సింగార్ బేస్‌లో కొలువుదీరిన శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో మూడవ మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పంచామృతాభిషేకం, పసుపు, కుంకుమార్చనలు చేశారు. అదేవిధంగా బోనాలు సమర్పించారు. అలాగే కొండారెడ్డిపల్లి రోడ్డు మార్గంలో వెలసిన జములమ్మ, రాయికోటి ఎల్లమ్మకు మహిళలు ప్రత్యేకించి పసుపు, కుంకుమార్చనలు చేసి, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పరిమాళపురంలో రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో మహిళలు బోనాలతో నైవేద్య నివేదన చేశారు.

దోమల నివారణకు ఫాగింగ్

ధన్వాడ: మండలంలోని కొండాపూర్ గ్రామంలోని గిరిజన గురుకులంలో దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాంమనోహర్‌రావు ఆదేశానుసారం కార్యక్రమం నిర్వహించారు. కొంత మంది విద్యార్థులకు వైరల్ ఫీవర్స్ సోకుతున్న నేపథ్యంలో ప్రిన్సిపల్ రాజారాం విన్నవించగా చర్యలు తీసుకున్నారు.

విద్యార్థులు లక్ష్యసాధనకు కృషిచేయాలి



మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధులు

కోస్గి: విద్యార్థులు లక్ష్యసాధనకు కృషిచేయాలని, ఉన్నత లక్ష్యం నిర్ణయించుకొని కష్టపడి చదివితే సాధన సులభతరమవుతుందని నిర్మాణ్, ఎస్‌బీపీ సంస్థ ప్రతినిధులు సూచించారు. మంగళవారం హకీంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పాశ్చాత్య పోకడలకు అలవాటుపడుతూ నేటితరం చెడు వ్యసనాల వైపు వెళ్తోందని, అది సరికాదన్నారు. ఉన్నత విద్యను అభ్యసించే పేద విద్యార్థులకు తమ సంస్థ తరపున సహకారం అందిస్తామన్నారు. ఇందులో సంస్థ ప్రతినిధులు రెడ్యానాయక్, రాజ్ కుమార్, లక్ష్మణ్‌తోపాటు పాఠశాల హెచ్ఎం మల్లికార్జున్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయం



నర్వ: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయమని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహా అన్నారు. సంఘం బలపర్చిన అభ్యర్థి ఏబీఎస్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. నర్వ, పాథర్చేడ్, పెద్దకడ్మూర్, కల్వాల్, ఉందేకోడ్ ఉన్నత పాఠశాలలలో మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, కోశాధికారి కిషోర్, నర్వ మండల కార్యదర్శి రాజు, నాయకులు ఆంజనేయులు, మన్మథ్‌కుమార్, రాఖీ, శ్రీధర్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

కోస్గి: రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తపస్ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఏబీఎస్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని జిల్లా అధ్యక్షుడు శేరి కృష్ణారెడ్డి అన్నారు. ఈ మేరకు నియోజకవర్గంలోని పలు పాఠశాలలలో ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర నాయకులు నర్సప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహాతోపాటు ఆయా మండలాల అధ్యక్షులు అంజిలయ్య, విజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు విడుదల చేయాలి



వినతి పత్రం అందిస్తున్న నాయకులు

నారాయణపేట టౌన్: పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ బాల్‌రాం డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి మురళికి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. పంచాయతీ కార్మికులు వేతనాలు అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అరకొర వేతనాలను కూడా రెగ్యులర్‌గా ఇవ్వకపోవడంతో కార్మికులు అప్పులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీయ కార్మికులకు ప్రతినెల 5వ తేదీలోపు వేతనాలు చెల్లించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా పంచాయతీ అధికారి మురళి మాట్లాడుతూ మూడు, నాలుగు రోజుల్లో వేతనాలు కార్మికుల ఖాతాలలో పడతాయని పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు కాశప్ప, బొమ్మన్ పాడ్ బాల్‌రాం, గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

కంపచెట్లు తొలగించండి

మరికల్: మాధవరం నుంచి కిష్టాపూర్ వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో దారిలోని ఆయా మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించక ప్రమాదాలు జరుగుతున్నాయి. విషయం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మరో పక్క మాధవరం శివారులో ఉన్న ప్రభుత్వ భూముల నుంచి రాత్రి సమయంలో టిప్పర్లతో మట్టిని తరలిస్తుండడంతో రోడ్డు గుంతలమయంగా మారిందని పరిష్కరించాలని కోరుతున్నారు.



బీటీ రోడ్డు వేయండి



నర్వ: మండలంలోని కొత్తపల్లి, లక్కర్‌దొడ్డి, జక్కన్నపల్లి గ్రామాల ప్రజలు రహదారి అస్తవ్యస్తంగా ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దశాబ్దాలుగా రహదారులు బీటీగా మారుతాయని కలలు కంటున్నామే తప్ప నిజం కావడం లేదని వాపోతున్నారు. కనీసం వర్షాకాలం వరకు శాశ్వత ప్రతిపాదికన పనులు చేపట్టి పూర్తిచేయాలని కోరుతున్నారు. సమస్యపై ఎన్నిసార్లు విన్నవించినా లాభం లేకుండా పోతోందని వాపోతున్నారు. ఇప్పటికైనా పరిష్కరించాలని కోరుతున్నారు.

నిరుపయోగంగా వాటర్ ప్లాంట్

మాగనూర్: మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో ఉన్న వాటర్‌ప్లాంట్ నిరుపయోగకరంగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు. అప్పటి ఎమ్మెల్యే నర్సిరెడ్డి 1994 సంవత్సరంలో గ్రామస్తుల త్రాగునీటి అవసరాల కోసం ఈ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. కాగా ప్రస్తుతం నిర్వహణలోపంతో వినియోగంలో లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వాటర్‌ప్లాంట్‌ను తిరిగి ప్రారంభించాలని కోరుతున్నారు.



కొత్తపల్లిలోని వాటర్ ప్లాంట్ పరిస్థితి ఇలా..

ఉపాధ్యాయులైన విద్యార్థులు



మాగనూర్‌లో స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు



మక్తల్‌లో..

మాగనూర్: జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల మాగనూర్ లో మంగళ వారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వ హించారు. విద్యార్థులు విద్యాశాఖ మంత్రిగా అంజమ్మ, కలెక్టర్‌గా విజయలక్ష్మి, డీఈఓగా వైశాలి, ఎంఈఓగా అనూష, ప్రధానోపాధ్యాయులుగా రేవతి వ్యవహరించారు. ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: పట్టణంలోని జీపీఎస్ మక్తల్ పాఠశాలలో స్వయం పరిపాలనా దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్‌గా జీయసుబ్రహ్మన్, జిల్లా విద్యాధికారిగా పల్లవి, ఎంఈఓగా ఇఫ్రా, ప్రధానోపాధ్యాయులుగా నేహబేగం వ్యవహరించారు. ప్రధానోపాధ్యాయులు అలీమాబేగం, ఎస్ఎంసీ చైర్మన్ , ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం పంపిణీ

నారాయణపేట టౌన్ : లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక భవిత ప్రత్యేక అవసరాల కేంద్రంలోని క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ హరినారాయణభట్టడ్, సభ్యులు కోట్ల జగన్మోహన్‌రెడ్డి, రవికుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు

ఊట్కూరు: మండలంలోని పులిమామిడి ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులను దృష్టిలో ఉంచుకుని దాతల సహాయంతో 10వ తరగతి విద్యార్థులకు ఉదయం వేళలో అల్పాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శంకరయ్య మాట్లాడుతూ రెండేళ్లుగా దాతల సహాయంతో అల్పాహారాన్ని అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నవీన్‌కుమార్, వినయ్‌వర్మ, నర్మద తదితరులు పాల్గొన్నారు.



పులిమామిడి పాఠశాలలో అల్పాహారం అందుకుంటున్న విద్యార్థులు

'గుర్రం చెన్నకేశవరెడ్డికి ప్రాధ్యానం ఇవ్వండి'



ఊట్కూరు పాఠశాలలో ప్రచారం చేస్తున్న నాయకులు

ఊట్కూరు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ బలపర్చిన గుర్రం చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని జిల్లా ప్రధానకార్యదర్శి జనార్దన్‌రెడ్డి కోరారు. మంగళవారం ఊట్కూరు మండలంలోని చిన్నపొర్ల, పులిమామిడి, బిజ్వార్, పెద్దజట్రం, ఊట్కూరు తదితర ఉన్నత పాఠశాలలలో ప్రచారం చేపట్టారు. జిల్లా గౌరవ అధ్యక్షులు లక్ష్మారెడ్డి, రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు సత్యపాల్, ఆనంద్, రవీందర్‌రెడ్డి, ప్రేమకుమారి తదితరులు పాల్గొన్నారు.

5 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

మరికల్: మండల కేంద్రంలో సోమవారం రాత్రి పీడీఎస్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. రాయిచూర్ రోడ్డు పక్కన ఓ ఇంట్లో 5 క్వింటాళ్ల బియ్యం గుర్తించినట్లు తెలిపారు. పట్టుబడ్డ బియ్యాన్ని మండల కేంద్రంలోని రేషన్ దుకాణానికి తరలించారు. అక్రమంగా బియ్యం వ్యాపారం చేస్తున్న వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఆర్‌ఐ కాళప్ప తెలిపారు. మరికల్ మండలంలో వరుసగా బియ్యం పట్టుబడుతుండటంతో మండల వ్యాప్తంగా బియ్యం వ్యాపారం చేస్తున్న వారిని గుర్తిస్తున్నట్లు వివరించారు. వరుసగా సోదాలు చేసి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తామన్నారు.



పట్టుబడ బియ్యంతో అధికారులు

బస్సుచార్జీ తగ్గించాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న నాయకులు, విద్యార్థులు

దామరగిద్ద: మినిమమ్ చార్జీల పేరుతో తక్కువ దూరం ప్రయాణించే ప్రయాణికులతోనూ అధికంగా వసూలు చేస్తున్నారని, చార్జీలను తగ్గించాలని మంగళవారం మద్దెల్‌బీడ్ వాసులు రాస్తారోకో చేపట్టారు. సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా నాయకులు మద్దతు ప్రకటించారు. నాయకులు తాయప్ప, చిన్నయ్య, రామకృష్ణలు మాట్లాడుతూ గతంలో రూ. 10 చార్జీ ఉండగా నారాయణపేటకు 5 కిలో మీటర్ల దూరం ఉన్న తమ గ్రామ ప్రజల నుంచి ప్రస్తుతం రూ.20 వసూలు చేస్తున్నారని విమర్శించారు. డీఎం రావాలంటూ డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకొని రాస్తారోకో చేస్తున్న వారితో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, డిపో మేనేజర్‌తో చర్చించి చార్జీ తగ్గించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు. దాదాపు గంట పాటు రాస్తారోకో చేపట్టడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

'కంటివెలుగు'ను వినియోగించుకోండి



గుర్జాల్‌లో కార్యక్రమం ప్రారంభిస్తున్న నాయకులు



కొత్తపల్లిలో పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

కృష్ణా: ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంతో పేదలకు ఎంతో మేలు జరుగుతోందని జెడ్పీటీసీ సభ్యురాలు అంజనమ్మ అన్నారు. మండలంలోని గుర్జాల్ గ్రామంలో మంగళవారం కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం వైద్య సిబ్బందిని సన్మానించారు. ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచ్ దేవేంద్రప్ప, నాయకులు శివరాజ్‌పాటిల్, నర్సప్ప, ఈశప్పగౌడ పాల్గొన్నారు.

మాగనూర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు రెండోవిడత మండలంలో కొనసాగుతోంది. కొత్తపల్లి గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి సందర్శించారు. కంటి సంబంధ సమస్యలు ఉన్నవారు శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

దామరగిద్ద: యాసంగి సాగులో వరి పంటలో చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి అరవింద్ అన్నారు. మంగళవారం మండలంలోని గత్ప గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పంటల నమోదును పర్యవేక్షించారు. ఆయిల్ ఫాం యాజమాన్య పద్ధతులను అందిస్తున్న సబ్సిడీలను వివరించారు. సర్పంచ్ రాములు, ఏఈఓలు అజయ్‌కుమార్ నరేష్ పాల్గొన్నారు.



రెతులతో మాట్లాడుతున్న అధికారి

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

నారాయణపేట టౌన్ : టీఎస్ యూటీఎఫ్ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి పాపన్న గారి మాణిక్‌రెడ్డిని గెలిపిద్దామని నాయకులు అన్నారు. జిల్లాలోని వివిధ మండలాలలో ఉన్న పాఠశాలల్లో రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రఘుపాల్ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, రాష్ట్ర కమిటీ సభ్యులు వేణుగోపాల్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.